# బయోటెక్నాలజీ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (బిఆర్ఎఐ) బిల్లు, 2011

## జెనెటిక్ ఇంజనీరింగ్ (జిఇ)పై ప్రజల ప్రశ్నలకు ఈ బిల్లు సమాధానాలిస్తుందా?

### 1) ఈ బిల్లు వాస్తవానికి ఎందుకు?

వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల రంగాల్లో 'ఆధునిక బయో టెక్నాలజీ' అమలును అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిందే ఈ బిఆర్ఎఐ బిల్లు. ఈ బిల్లులో ఆధునిక బయో టెక్నాలజీని నిర్వచించారు. ఈ నిర్వచనం ఎంత విస్తారమైనదంటే జెనెటిక్ ఇంజినీరింగ్ (జిఇ)ను కూడా ఇందులో చేర్చారు. భారత ప్రభుత్వ సైన్సు, టెక్నాలజీ మంత్రిత్వశాఖ భారత విధాన పత్రాలు – సైన్సు అండ్ టెక్నాలజీ విధానం (2003), జాతీయ బయో టెక్నాలజీ డెవలప్‌మెంట్ స్ట్రాటజీ (2007) విడుదల కాకముందే వివిధ రంగాల్లో జిఇని అమలు చేయాలని భారత ప్రభుత్వం తొందరపడుతూ వచ్చింది. ఈ ప్రతిపాదిత శాసనం ద్వారా చట్టబద్ధమైన సైన్సు ఆధారిత నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకోసం బిఆర్ఎఐని శిఖరాగ్రంలో తమ నోడల్ ఏజెన్సీగా ఉంచాలనుకుంటోంది. ఐదుగురు సభ్యుల సంస్థగా దీనిని ప్రతిపాదించారు. దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంటుంది. దీనికి చైర్‌పర్సన్, ఇద్దరు పూర్తికాలపు, ఇద్దరు పాక్షిక కాలపు సభ్యులు ఉంటారు. సభ్యులందరి పదవీ కాలం మూడేళ్లు ఉండాలని ప్రతిపాదించారు. ఈ అథారిటీని జీవభద్రత (బయోసేఫ్టీ) కోసం ఏర్పాటు చేస్తున్నట్లు పైకి కన్పించినా, ఆధునిక బయోటెక్నాలజీ ఉత్పత్తుల కోసం ఆమోద పద్ధతులను సులభతరం చేయడమే అసలు ఉద్దేశంగా కన్పిస్తోంది. ఆధునిక బయోటెక్నాలజీ ఉత్పత్తులను, ఆర్గానిజమ్స్ పరిశోధన, రవాణా, ఉత్పత్తి, దిగుమతి, ఉపయోగాలను నియంత్రించడానికి బిఆర్ఎఐని ప్రతిపాదిస్తున్నారు.

### 2) జిఇ విషయంలో బయో టెక్నాలజీ అథారిటీ ఆఫ్ ఇండియాకు తుది నిర్ణయాధికారం ఉంటుందా?

ఉండదు. బిఆర్ఎఐ తీసుకునే ఏ నిర్ణయాన్నయినా కేంద్ర ప్రభుత్వం "వీటో" చేయవచ్చు. తన ఆదేశాల్లో దేనినైనా అనుసరించ లేదని, కేంద్ర ప్రభుత్వం భావిస్తే ఈ అథారిటీని రద్దుచేయవచ్చు. అటువంటి అధికారాలను కట్టబెడుతూ ఈ బిల్లులో ఒక సౌకర్యం ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వ ఆదేశాన్ని అథారిటీ ఆరు నెలల వరకు అమలు చేయకుండా ఉండవచ్చు. ఆరునెలలు అయిపోయిన వెంటనే బిఆర్ఎఐని పునర్ వ్యవస్థీకరించ వలసి ఉంటుంది. బిఆర్ఎఐని స్వతంత్ర సాధికార సంస్థగా ఏర్పాటు చేయాలన్నది విజ్ఞుల, నిపుణుల అభిప్రాయమైనా దీనిని కీలుబొమ్మలా రూపొందించడానికి రంగం సిద్ధమైంది. ఈ అథారిటీ విధాన పరమైన విషయాల్లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లోబడి ఉండాలని బిల్లులో ప్రతిపాదించారు.

### 3) భారతదేశంలో ప్రస్తుత జిఇ నియంత్రణ వ్యవస్థను ఇది ఏ విధంగా మార్చగలదు?

ప్రస్తుతం భారతదేశంలో జిఇకి సంబంధించిన వివిధ అంశాలను అనేక మంత్రిత్వ శాఖలు, వివిధ ప్రభుత్వ విభాగాలు నియంత్రిస్తున్నాయి. ప్రాథమికంగా పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, పర్యావరణ పరిరక్షణ చట్టం – 1986 కింద నియంత్రిస్తోంది. ప్రమాదకరమైన సూక్ష్మ జీవాణువు (మైక్రో ఆర్గానిజమ్స్), జన్యుపరంగా మార్పిడి చేసిన జీవాణువులు, లేదా కణాల ఉత్పత్తి, వినియోగం, దిగుమతి, ఎగుమతి కోసం నియమ నిబంధనలను 1989లో ప్రకటించారు. ఈ నిబంధనల ప్రకారం భారీ ఉత్పత్తి, పర్యావరణ అంశాలు, వినియోగానికి జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రయిజల్ కమిటి (జిఇఎసి) బాధ్యత తీసుకోవలసి ఉంటుంది. సైన్సు, టెక్నాలజీ మంత్రిత్వశాఖ కింద ఉండే బయోటెక్నాలజీ విభాగం (డిబిటి) ఆర్‌డిఎన్ఎ భద్రత అంశాలపై 1990లో మార్గదర్శకాలు విడుదల చేసింది. డిబిటి కింద రివ్యూ కమిటీ ఆన్ జెనెటిక్ మానిప్యులేషన్ (ఆర్‌సిజిఎం) పరిశోధన, క్షేత్ర పరీక్షలను పర్యవేక్షిస్తుంది. జీవ భద్రత (బయోసేఫ్టీ)కి సంబంధించిన అన్ని అంశాలను నియంత్రించే ఏకైక సంస్థగా బిఆర్ఎఐని ఈ బిల్లు తయారు చేసింది. దీని ప్రకారం జిఇఎసి, ఆర్‌సిజిఎంలు ఎంతో కాలం మనుగడలో ఉండవు. దీనికి తోడు వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, డైరెక్టరేట్లు, కౌన్సిల్స్, అథారిటీల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి 17 మంది సభ్యులతో ఇంటర్ మినిస్టీరియల్ గవర్నింగ్ బోర్డు (ఐఎంజిబి)ని కూడా ఏర్పాటు చేస్తారు. 15 మంది సభ్యుల బయోటెక్నాలజీ అడ్వయిజరీ కౌన్సిల్ (బిఎసి) బిఆర్ఎఐకి వ్యూహాత్మక సలహాలు ఇస్తుంది. ఈ అంశాలన్నిటినీ బిఆర్ఎఐ బిల్లులో ప్రతిపాదించారు.

### 4) ఈ అంశంపై ఏ మంత్రిత్వ శాఖకు ఎక్కువ నియంత్రణ, అధికారం ఉంటుంది?

బిఆర్ఎఐ బిల్లు చట్టంగా మారితే సైన్సు, టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌టి)కు ఈ అంశంపై ఇది వరకటి కంటే ఎక్కువ నియంత్రణ, అధికారాలు ఉంటాయి. ఆధునిక బయోటెక్నాలజీ వినియోగాన్ని ఆమోదించి అమలుచేసే విస్తృత అధికారాలు ఎంవోఎస్‌టికే ఉంటాయి. ఈ బిల్లుతో పర్యావరణ మంత్రిత్వశాఖ నియంత్రణ, అధికార పరిధి తగ్గిపోతుంది. ఈ బిల్లు ప్రకారం పర్యావరణ భద్రతా అంశాలను ఎన్విరాన్‌మెంట్ అప్రయిజల్ ప్యానల్ (ఇఎపి) చూస్తుంది. ఇఎపిని పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖలో సంప్రదించి బిఆర్ఇఐ ఏర్పాటు చేస్తుంది. ఈ సంఘం అధ్యక్షుడిని, సభ్య కార్యదర్శిని ఎంఓఇఎఫ్ నామినేట్ చేస్తుంది. ఇఎపి అభిప్రాయాన్ని బిఆర్ఎఐ తీసుకోవాలని ఉంది కానీ దానిని తప్పని సరి చేయకపోవడం ఆలోచించాల్సిన మరో అంశం. బిఆర్ఎఐ బిల్లు సైన్సు, టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అధికార పరిధిని పెంచుతుంది. ఆ శాఖ పేరును ఎక్కువగా ప్రస్తావించకుండానే ఆ శాఖ పరిధిలోని వివిధ విభాగాలు, సంస్థలకు నియంత్రణ అధికారాలను ప్రతిపాదించారు. ఈ బిల్లును ప్రతిపాదించినది సైన్సు, టెక్నాలజీ మంత్రిత్వ శాఖే. ఈ నేపథ్యంలో బిఆర్ఎఐ స్వతంత్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**5) ఆధునిక బయోటెక్నాలజీలపై రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంత అధికారం ఉంటుంది?**

రాష్ట్ర ప్రభుత్వాలకు పరిమిత అధికారాలు ఉంటాయి. ఆధునిక బయోటెక్నాలజీ పరిశ్రమ నియంత్రణ బాధ్యతను ప్రజా శ్రేయస్సు దృష్ట్యా కేంద్ర ప్రభుత్వమే తీసుకోవాలని ఈ బిల్లులో ప్రతిపాదించారు. అయినా రాష్ట్ర ప్రభుత్వాలు స్టేట్ బయోటెక్నాలజీ రెగ్యులేటరీ అడ్వయిజరీ కమిటీ (ఎస్‌బిఆర్‌ఎసి)ని ఏర్పాటు చేసుకోవాలన్నది మరో మెలిక. దీనికి రాష్ట్ర కమీషన్/ బయో టెక్నాలజీ విభాగాధిపతి నేతృత్వం వహించాలి.

**6) ఈ ప్రతిపాదిత చట్టం కింద రాష్ట్రస్థాయి కమిటీ విధులు ఏమిటి?**

బయో టెక్నాలజీ నియంత్రణకు సంబంధించిన రాష్ట్ర నిర్దిష్ట అవసరాలను గుర్తించడం ఎస్‌బిఆర్‌ఎసి ప్రధాన విధి. రాష్ట్రానికి బిఆర్‌ఎఐకి మధ్య అనుసంధానంగా ఇది పని చేయవలసి ఉంటుంది. బిఆర్‌ఎఐ నుంచి వచ్చే సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో, పారదర్శకంగా ఉంచే బాధ్యతను ఈ బిల్లు ఎస్‌బిఆర్‌ఎసిపై ఉంచింది. బిఆర్‌ఎఐ బిల్లును నిశితంగా పరిశీలిస్తే ఈ అంశానికి సంబంధించి రాష్ట్ర చట్టాలకు విలువ ఉండదని తెలుస్తుంది. భారత రాజ్యాంగం ప్రకారం వ్యవసాయాన్ని రాష్ట్ర సబ్జెక్టుగా చేసినా ఇక్కడ రాష్ట్రాల అధికారాలను నామ మాత్రం చేయడం గమనించవలసిన విషయం. జిఇ ఆహార పంటల ఆమోదాలకు వ్యతిరేకంగా స్థానికంగా ప్రజా ఉద్యమాలు జరిగాయి. ఉదాహరణకు బిటి వంకాయకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలు అనేక రాష్ట్ర ప్రభుత్వాలను ప్రభావితం చేశాయి. జిఇ, బిటి పంటలపై స్థానిక ప్రజల వ్యతిరేక స్పందనను తెలుసుకున్న అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో జిఇ వ్యవసాయాన్ని గట్టిగా తిరస్కరించాయి. రాష్ట్రస్థాయి నిర్ణయాలు తీసుకునే అధికారాలను ఇస్తారో లేదో వేచి చూడాలి.

**7) ఆధునిక బయో టెక్నాలజీ అమలుకు సంబంధించి రాష్ట్రాలకు న్యాయ, విధాన పరమైన అధికారాలు ఏమైనా ఉన్నాయా?**

కర్ణాటక వంటి రాష్ట్రాల్లో స్టేట్ బయో టెక్నాలజీ కో-ఆర్డినేషన్ కమిటీలు (ఎస్‌బిసిసి)లు 1989 చట్టంలోని నిబంధనల ప్రకారం ఏర్పాటయ్యాయి. ఈ కమిటీలు కాలానుగుణంగా జిఇ జీవాణువులు, ఇతర ప్రమాదకర సూక్ష్మజీవుల భద్రత, నియంత్రణ చర్యలను సమీక్షించవలసి ఉంటుంది. అవసరమైతే ముందస్తు చర్యలు తీసుకునే అధికారం కూడా వాటికి ఉంటుంది. రాజస్థాన్ గుజరాత్‌లలో సంపూర్ణతను సంతరించుకున్న బయో టెక్నాలజీ విధులను ఇతర రాష్ట్రాలు అనుసరించాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఏడు రాష్ట్రాలు జిఇ పంటల క్షేత్ర ప్రయోగ పరీక్షలను నిక్కచ్చిగా వ్యతిరేకించాయి. జిఇ పంట ప్రయోగాలను వ్యతిరేకించిన రాష్ట్రాల్లో బీహార్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళ ఉన్నాయి. ఒరిస్సా వంటి కొన్ని రాష్ట్రాల్లో ప్రజలు తమ సొంత రాష్ట్రస్థాయి జీవ భద్రత చట్టాలు చేసుకున్నాయి. బిఆర్‌ఎఐ బిల్లు చట్టంగా అమలులోకి వస్తే అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఎస్‌బిసిసిలు ఎస్‌బిఆర్‌ఎసిలుగా మారిపోతాయి.

**8) ఈ బిల్లు కింద బయో టెక్నాలజీని నియంత్రించడానికి జిల్లా స్థాయి యంత్రాంగం ఏమైనా ఉందా?**

లేదు. జిల్లా స్థాయి నియంత్రణకు ఎటువంటి ప్రస్తావనలు ఈ ముసాయిదా బిల్లులో లేవు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం 1989 చట్టంలోని నియంత్రణాధికారాలు జిల్లాస్థాయి సంఘం (డిఎల్‌సి)కి ఉండాలి.

**9) ఈ బిల్లు స్థానిక కమ్యూనిటీలకు ఏవైనా అధికారాలు కల్పిస్తోందా?**

ఈ బిల్లులో స్థానిక కమ్యూనిటీల ప్రస్తావన ప్రత్యక్షంగా అయితే లేదు. సహజోత్పత్తులకు సంబంధించి ప్రజల నుంచి సలహాలను అభ్యంతరాలను బిఆర్‌ఎఐ స్వీకరించి తీరాలని నిర్దేశించారు. అలాగే తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రభావాల గురించి ప్రజలకు తప్పని సరిగా తెలియజేయాలి.

**10) ఈ బిల్లు కింద ఏ వ్యక్తి అయినా కోర్టుకు వెళ్ల వచ్చా?**

వీలు లేదు. ఈ ప్రతిపాదిత బిల్లులో పౌర న్యాయస్థానాల పరిధి నుంచి మినహాయింపు నిబంధన ఉంది. ఈ బిల్లు ప్రకారం కేంద్ర ప్రభుత్వం బయో టెక్నాలజీ రెగ్యులేటరీ అప్పిలేట్ ట్రిబ్యునల్ (బిఆర్‌ఎటి)ని ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఇది సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ సివిల్ కోర్టులా వ్యవహరిస్తుంది, ఈ బిల్లు ప్రకారం కేంద్ర ప్రభుత్వం, ఇతర సంస్థలు, సంఘాలు, కమిషన్లు, అధికారులు ఏ వ్యాజ్యాలు, విచారణలు, న్యాయ లావాదేవీల నుంచి మినహాయించబడతారు.

**11) ప్రతిపాదిత చట్టంలో దేశంలోని ఆహార భద్రత పరిస్థితి గురించి ప్రస్తావన ఉందా?**

ఆహార భద్రత అంటే అందుబాటులో ఉండే ఆహారం, అది వ్యక్తికి చేరే వ్యవహారం. ఈ అంశంపై మరొక జాతీయ ఆహార భద్రత బిల్లు, 2011ను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి చర్చలు జరుగుతున్నాయి. జిఇ పంటలకు, జిఇ పశువులకు పర్యావరణ అనుమతులు ఇస్తే, జన్యుకాలుష్యం సంభవించి ఆహార భద్రత ఆందోళనలో పడుతుంది. ఇప్పటికే మనదేశంలో జనాభాకు మించి ఆహార ఉత్పత్తి ఉంది. జిఇ పంటలు, జిఇ పశువుల కోసం మనం అర్రులు సాచవలసిన అవసరం లేదు. సమృద్ధిగా ఉన్న ఆహార ధాన్యాలను, పదార్థాలను ప్రభుత్వాలు ప్రజలకు సరిగా, సమర్థవంతంగా అందించలేకపోతున్నాయి. ఈ అసమర్థతను పైకి కన్పించనివ్వకుండా, ప్రజలందరికీ ఆహారం అందాలన్న సాకుతో అధికోత్పత్తి పేరుతో కొత్త వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాలను ముందుకు తేవడానికి ప్రయత్నం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వానికి ఆహార భద్రత గురించి నిజమైన స్పృహ ఉంటే అందుబాటులో ఉన్న భూమిని ఆహార ధాన్యాల సాగుకు, చేపల పెంపకానికి, పశు గ్రాసానికి వినియోగమయ్యేలా చూడాలి. వ్యవసాయంలో జిఇ వల్ల కష్టాల్లో పడిపోతామన్న ఆందోళన చిన్న రైతుల్లో ఎక్కువగా ఉంది. తమ తిండికి అవసరమైన వాటిని ఆరోగ్యకరమైన పర్యావరణ పరిస్థితుల్లో పండించుకుంటూ, దేశానికి కూడా కొంత ఆహారాన్ని అందిస్తున్న వారు ఈ చిన్న రైతులే. ఈ చిన్న రైతుల శ్రేయస్సు, మనుగడ కోసం ఈ బిల్లులో ప్రస్తావనలు లేవు. ఆహార సార్వభౌమత్వ భావనకు దూరంగా ప్రజలను దారిమళ్లించే విధంగా ఈ బిల్లు ఉంది.

**12) వినియోగదారుల ఆహార భద్రత అంశం గురించి ఈ బిల్లు ఏం చెబుతోంది?**

భారతదేశంలో ఆహార భద్రత, నియంత్రణ చట్టం (ఎఫ్ఎస్ఎస్ఎ) 2006 అమలులో ఉంది. ఎఫ్ఎస్ఎస్ఎ అధికార పరిధిలోకి తాము ప్రవేశించబోమని బిఆర్ఎఐ బిల్లులో స్పష్టంగా చెప్పారు. అదే విధంగా ఎఫ్ఎస్ఎస్ఎ కూడా బిఆర్ఎఐ అధికార, నియంత్రణల పరిధిలోకి ప్రవేశించబడదు. దీని ఫలితంగా జిఇ పదార్థాల ఆహార భద్రత అంచనాలను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ), జిఇ ఆర్గానిజమ్స్/ఆహారాల పర్యావరణ సమస్యలను బయోటెక్నాలజీ రెగ్యులేటరీ అథారిటీ చూసుకుంటాయి. జిఎం/జిఇ ఉత్పత్తులైన కొన్ని విత్తన మొక్కలు, దాణా, గ్రాసం వంటి వాటికి ఈ రెండు సంస్థల నుంచి అనుమతి తీసుకోవలసి ఉంటుంది. తదుపరి చట్టంలో జిఎం/జిఇ నిర్వచనాన్ని చేర్చడం ద్వారా ఈ బిల్లు ఎఫ్ఎఫ్ఎస్ఎను సవరించినట్లుగా కన్పించదు. జిఇ ఆహార ఉత్పత్తులను భారత దేశ ప్రజలు వ్యతిరేకించినా దిగుమతుల రూపంలో జిఇ వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఇందుకోసం లేబలింగ్ అంశాన్ని కూడా ప్రతిపాదిత బిఆర్ఎఐ బిల్లులో చేర్చవలసిన అవసరముంది. వినియోగదారుడి భద్రత గురించి బిల్లులో నిర్దిష్టంగా ప్రతిపాదనలు లేవు.

**13) జిఇ విత్తనాలు తగిన ఫలితాలను ఇవ్వని పక్షంలో ఈ బిల్లు నష్ట పరిహారాలను, ఇతర మార్గాలను ప్రతిపాదిస్తున్నదా?**

అటువంటివి లేవు. ఈ బిల్లు అంశాల్లో వాటి ప్రస్తావన లేదు. ఈ ముఖ్యమైన అంశాన్ని తక్షణం పరిశీలించవలసిన అవసరముంది. ప్రతిపాదిత విత్తన బిల్లు-2010లో కూడా ఈ అంశం లేదు. ఈ విత్తన బిల్లు కూడా వచ్చే పార్లమెంటు సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశముంది. వినియోగదారుల రక్షణ చట్టం - 1986 అధికార, నియంత్రణ పరిధి నుంచి తమ ఉత్పత్తులను మినహాయించాలని విత్తన పరిశ్రమ కూడా కోరుతోంది.

**14) ఈ బిల్లు వల్ల పశు పక్ష్యాదులకు నష్టం జరుగుతుందా?**

అవును. జరుగుతుంది. జంతువుల ఆరోగ్యం, బయో టెక్నాలజీ వినియోగం అనే అంశం కూడా బిఆర్ఎఐ నియంత్రణ పరిధిలోకి వస్తుంది. ఈ అథారిటీ కిందికి వచ్చే మూడు రెగ్యులేటరీ డివిజన్లలో హ్యూమన్ హెల్త్ అండ్ వెటర్నరీ డివిజన్ ఒకటి. ఇతర విషయాలతో పాటు డిఎన్ఎ వాక్సీన్లు, జంతువుల కోసం సింథటిక్ బయాలజీ ఉత్పత్తులు, షెడ్యూలు-1, పార్ట్-2లోని ట్రాన్స్‌జెనిక్ బ్లడ్, ఇతర బయోటెక్నాలజీ, ఆర్గానిజమ్స్ ఉంటాయి.

**15) తన ప్రాంతంలో జన్యుమార్పిడి విత్తనాల క్షేత్ర పరిశోధనలు, పరీక్షలు జరిగితే మామూలు వ్యక్తి ఏమి చేయవచ్చు?**

ఇటువంటి సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి అవసరమైన ప్రజా చైతన్యం గురించి ప్రస్తావన బిల్లులో లేదు. బిల్లుతో జత పరిచిన పార్ట్-1, 3 షెడ్యూలులో పేర్కొన్న బయో టెక్నాలజీ ఆర్గానిజమ్స్ లేదా ఉత్పత్తులకు సంబంధించి ఎవరూ క్షేత్ర పరీక్షలు చేయకూడదు. తగిన భద్రతా చర్యలు ఉన్నాయని భావిస్తే క్షేత్ర పరిశోధనలకు బిఆర్ఎఐ అనుమతించవచ్చని ఈ బిల్లులో ఉంది, ఈ బిల్లులో 'క్షేత్ర పరీక్షల' నిర్వచనం ఏమిటంటే - జిఇ ఆర్గానిజమ్‌ను వాటి విత్తనీకరణ, విస్తృతికి అనువైన వాతావరణంలో నిర్దిష్ట నిబంధనలకు లోబడి పెంచడం. నిబంధనలకు వ్యతిరేకత క్షేత్ర పరీక్షలు నిర్వహిస్తే ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష, రెండు లక్షల జరిమానా లేదా రెండూ కూడా విధించాలని ఈ బిల్లులో ప్రతిపాదించారు. అయితే ఫిర్యాదు ఎవరికి ఇవ్వాలో ఎలా ఇవ్వాలో బిల్లులో ప్రస్తావించలేదు. చదువురాని చిన్న రైతులు ఇంతపెద్ద విషయాలను గ్రహించలేరు. ఈ విషయమై ప్రజలు నిలదీస్తే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి మార్పులు సూచించవచ్చునేమో. ఈ అంశాన్ని బిఆర్ఎఐ, ఎస్‌బిఆర్ఎసి క్షుణ్ణంగా పరిశీలించవలసిన అవసరముంది. ఈ బిల్లు చట్టాన్ని అమలు చేసే అధికారులకు విస్తృత అధికారాలను ఇచ్చింది. సెర్చ్, ఇన్‌స్పెక్షన్ అధికారాలను కట్టబెట్టింది. ఇవి అవినీతికి ఆస్కారం కల్పించే అవకాశముంది.

**16) ఒక రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం జిఇ పరిశోధనను చేపడితే ఈ ప్రతిపాదిత కొత్త చట్టం కింద ఏమి చేయవచ్చు?**

ఒక విశ్వవిద్యాలయం చేసే తప్పిదాల గురించి ఈ బిల్లులో నిర్దిష్ట విభాగం ఉంది. ఈ బిల్లు ప్రకారం ఎవరైనా గవర్నర్, వైస్-ఛాన్స్‌లర్, డైరెక్టర్, కమిటీ, ట్రస్టీ, రిజిస్ట్రార్, లేదా ఏ ఇతర అధికారి ఆమోదం, కుమ్మక్కు, నిర్లక్ష్యంలో పాత్ర ఉన్నట్లయితే నేరం చేసినట్లే పరిగణించాలి. ఆసక్తికరమైన విషయమేమిటంటే దీనికి శిక్ష ఏమిటో స్పష్టం చేయకపోవడం. అటువంటి వ్యక్తిని 'ప్రాసిక్యూట్ చేసి తగిన విధంగా శిక్షకు గురిచేయాలి' అని మాత్రమే ఉంది. ఇదే నిబంధన సొసైటీకి, ట్రస్టుకు వర్తిస్తుంది. ఈ విధంగా ప్రభుత్వేతర సంస్థలకు కూడా వర్తిస్తుంది. అయితే ఈ విషయాన్ని ఎలా లేవనెత్తాలన్న విధివిధానాలను బిల్లులో పొందుపరచలేదు.

**17) జన్యు కాలుష్య అవకాశం, నిర్ధారణ ఉన్న పక్షంలో బిఆర్ఎఐ బిల్లు ఏ విధంగా నియంత్రిస్తుంది?**

రిస్క్ అసెస్‌మెంట్ యూనిట్‌ను తప్పనిసరిగా అథారిటీ ఏర్పాటు చేయాలి. సైన్సు ఆధారిత భద్రతా అంచనాలను నిబంధనలకు అనుగుణంగా అమలు చేస్తున్నారో లేదో చూడాల్సిన బాధ్యతను ఈ యూనిట్‌కు అప్పగించారు. పరిశోధన, రవాణా, దిగుమతికి సంబంధించి బిఆర్ఎఐ ముందుకు వచ్చే వాటిని భద్రత ప్రమాదాలను శాస్త్రీయంగా విశ్లేషించవలసి ఉంటుంది. రిస్క్ అసెస్‌మెంట్ యూనిట్ భద్రతకు సంబంధించిన స్పష్టమైన అంచనాలను సమర్పించినా తుది పరిశీలనాధికారం అథారిటీకే ఉంటుంది. ఈ దశలో సైన్సు ఆధారిత నిర్ణయాన్ని రాజకీయ దురుద్దేశంతో కూడినదిగా చిత్రించే ప్రమాదముంది. జీవ భద్రతను నిర్ధారించడానికి అనుసరించే ఈ పద్ధతి నిర్ధారణ కాని శాస్త్రీయ అంచనాలపై ఆధారపడి ఉంటుంది. ఆధునిక బయో టెక్నాలజీ ప్రమాదాలను అంచనావేసి అధిగమించవచ్చన్నది అశాస్త్రీయంగా కన్పిస్తోంది. జీవుల మనుగడ సహజ సూత్రాలపై ఆధారపడి ఉంటుంది కానీ పార్లమెంటు చేసే చట్టాలపై ఆధారపడి ఉండదు. బిల్లులో అత్యవసర ప్రణాళికల ప్రస్తావన లేదు.

## 18) ఈ బిల్లులో మేధో సంపత్తి నిబంధనలు ఉన్నాయా?

బిల్లులో నిర్వచించిన 'విశ్వసనీయ వాణిజ్య సమాచారం' బయటికి పొక్కకూడదు. ఈ బిల్లు ప్రకారం ఇటువంటి సమాచారాన్ని అథారిటీ రహస్యంగా ఉంచి, సమాచార హక్కు చట్టం–2005 నుంచి మినహాయింపు పొందవచ్చు. ప్రజా ప్రయోజన అంశాలేమిటో, వేటిని గోప్యంగా ఉంచకూడదో నిర్ణయించే విచక్షణాధికారాలను కూడా అథారిటీకే ఇచ్చారు. ఈ బిల్లులో మేధో సంపత్తి హక్కుల (ఐపిఆర్) గురించి స్పష్టమైన ప్రస్తావన లేకపోయినా ఐపిఆర్ గల వ్యక్తుల, సంస్థల హక్కుల రక్షణకు ఇది హామీ ఇస్తోంది. ఐపిఆర్ గల వ్యక్తుల, సంస్థలకు అనుకూలంగా ఈ బిల్లు ఉంది. ఒక నిర్దిష్ట కాల పరిమితి వరకు ఇతరులు బయో టెక్నాలజీ ప్రాసెస్ లేదా ప్రొడక్ట్ విషయంలో అనుకరణ, సమీకరణను ఐపిఆర్ హోల్డర్ వ్యతిరేకిస్తే ఆ హక్కును ఈ అథారిటీ అంగీకరించ వలసిన పరిస్థితి ఈ బిల్లు ద్వారా వస్తుంది. ఒక రకం సమాచారానికి 'గోప్యత'గా రక్షణ ఉంటే ప్రజా శ్రేయస్సుకు అవసరమైన బయోసేఫ్టీ డేటాను కూడా అలాగే దాచి ఉంచే అవకాశం ఏర్పడుతుంది.

## 19) ఆధునిక బయో టెక్నాలజీ ని వ్యతిరేకించే వారికి ఈ బిల్లు ప్రకారం ఎటువంటి శిక్షలు ఉంటాయి?

తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే సమాచారం ఇచ్చిన వారికి (మూడు నెలల జైలు శిక్ష ఐదు లక్షల వరకు జరిమానా) విధించవచ్చన్న ప్రతిపాదన ఈ బిల్లులో ఉంది. ప్రతిపాదిత చట్టం కింద విధులు నిర్వర్తించే అధికారి విధులను ఎవరైనా అడ్డుకుంటే ఇదే విధమైన శిక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదిత చట్టం లోని నియమ నిబంధనలను వ్యతిరేకించడం, నిరోధించడం శిక్షార్హమని పేర్కొన్నారు. 'నిరోధించడం' అనే పదం ప్రయోగం సముచితంగా లేదు. ఇటువంటి సందర్భాల్లో శిక్షను రెండేళ్ల వరకు పొడిగించవచ్చు. పది లక్షల వరకు జరిమానా విధించవచ్చు.

## 20) ఈ ప్రతిపాదిత చట్టం, ఇప్పటికే అమలులో ఉన్న ఇతర చట్టాలకు మధ్య ఉన్న సంబంధమేమిటి? ఉదాహరణకు జీవ వైవిధ్యంపై వైఖరి ఏమిటి?

ఈ ప్రతిపాదిత చట్టం అమలులోకి వస్తే ఇతర చట్టాలను అతిక్రమించే అవకాశముందని ఈ బిల్లులోని ఒక నిబంధన ద్వారా స్పష్టమవుతోంది. ఈ ప్రతిపాదిత చట్టంలోని నిబంధనలు ఇప్పటికే అమలులో ఉన్న చట్టాలకు మరింత మద్దతుగా ఉంటాయే కానీ వాటిని అతిక్రమించవలసిన మరో అంశం ఈ బిల్లులో ఉంది. ఈ విషయంలో ఈ బిల్లులో ఉన్న ద్వంద్వ వైఖరిని పరిష్కరించాలి. ఒక స్పష్టత రావాలి. జీవ భద్రత గురించిన మరో ఏకైక భారతీయ చట్టం బయోలాజికల్ డైవర్సిటీ యాక్ట్ – 2002. బయో టెక్నాలజీ నుంచి వచ్చే జన్యు మార్పిడి పంటలు, ఇతర అంశాలకు సంబంధించిన విషయాలను నియంత్రించి, నిర్వహించి, ప్రమాదాలను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా నిరోధించాలని ఈ ముసాయిదా బిల్లులో ప్రతిపాదించారు. మానవ ఆరోగ్యం, జీవ వైవిధ్య కొనసాగింపుపై ప్రతికూల ప్రభావం చూపేఏ అంశాలపై ప్రభుత్వం బాధ్యత వహించాలని సూచించింది.

## 21) ఈ బిల్లు గురించి జీవ భద్రతా ప్రజా ఉద్యమం ఏమంటోంది?

మొదట ఈ బిల్లులోని అంశాలను, పర్యవసానాలను అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో తమ సంఘటిత అభిప్రాయాన్ని స్థానిక కమ్యూనిటీలు కూడగట్టవలసిన అవసరముంది. ఈ బిల్లు గురించి, దానిపై ప్రజల అభిప్రాయం గురించి రాష్ట్రస్థాయి నిర్ణయాధికారులు తెలుసుకుని ఒక అభిప్రాయాన్ని తెలియజేయవలసిన అవసరముంది. ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టక ముందే స్పష్టంగా, విస్తృతంగా అభిప్రాయ వ్యక్తీకరణ జరగవలసి ఉంది. జన్యు మార్పిడేతర వ్యవసాయాన్ని మన పొలాల్లో ఒక దీక్షగా కొనసాగించాలి. మనం తినే అన్నంలో జన్యుమార్పిడి ఉత్పత్తులు ఉండకుండా చూసుకోవాలి.

*తమ సభ్యులు, స్నేహితులు, అనుబంధమున్న వ్యక్తుల మధ్య భావ వ్యక్తీకరణను పంచుకోడానికి సదరన్ యాక్షన్ ఆన్ జెనెటిక్ ఇంజినీరింగ్ (సేజ్) తయారు చేసిన పత్ర మిది. జన్యు మార్పిడి లేని సురక్షిత ఆహారం కోసం, జీవ వైవిధ్య అనుకూల వ్యవసాయం, అసలైన జీవ భద్రత కోసం ఇప్పుడు శ్రమిస్తున్న, దీని కోసం శ్రమించబోతున్న వారి కోసం ఈ పత్రాన్ని రూపొందించడం జరిగింది. దీనిలోని అంశాలను షాలినీ భుటానీ సవివరంగా అందజేశారు. మరిన్ని వివరాల కోసం ddshyderabad@gmail.com లేదా +91-40-27764577లో సంప్రదించండి.*

*బయో టెక్నాలజీ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (బిఆర్ఎఐ) బిల్లు, 2011 ని ఈ వెబ్ లింక్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ బిల్లు కాపీ ఆధారంగానే ఈ పత్రాన్ని రూపొందించాం. http://www.prsindia.org/uploads/media/Biotech/Biotech%20Regulatory%20Authority%20Bill%202011.pdf. (అక్టోబర్ 25, 2011 నాడు యాక్సెస్ అయిన విధంగా)*

*ప్రతిపాదిత చట్టం గురించి కచ్చితమైన సమాచారాన్ని ఈ డాక్యుమెంటులో పొందుపరచడం జరిగింది. ఇందులో ఇచ్చిన సమాచారాన్ని వినియోగించుకోవడం ద్వారా వచ్చే న్యాయపరమైన వ్యాజ్యాలకు, లావాదేవీలకు ప్రచురణకర్త కానీ, రచయిత కానీ బాధ్యత వహించరు.*

*ఈ ప్రచురణపై కాపీరైట్ లేదు. ఇందులోని సమాచారాన్ని ఉన్నది ఉన్నట్టుగా స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు. ఎక్నాలెజ్ చేయాలి.*

**బిఆర్ఎఐ బిల్లు పరిష్కారం కాదు, జన్యుమార్పిడి వద్దని చెప్పండి!**